విశాలాంధ్ర నంద్యాల

www.visalaandhra.com

కర్నూలు, గురువారం 10, ఏప్రిల్ 2025

ఆదమరిస్తే ప్రమాదమే

విశాలాంధ్ర-చాగలమర్రి : మండలంలోని మూడురాళ్ళపల్లె గ్రామానికి వెళ్ళే రహదారిలో వంకపై ఏర్పాటు చేసిన కల్వర్టు, చాగలమర్రి గ్రామంలోని వక్కి లేరు వద్ద ఏర్పాటు చేసిన 11కమాన్ల వంతెన స్లాబ్ బీటలు వారి దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. సైడ్వాల్, కల్వర్టు దెబ్బతిన్నాయి. రాత్రి వేలలో ఆదమరిస్తే వాహనదారులు ప్రమాదాలకు గురికావాల్సిందే. పాలకులు, అధికారులు స్పందించి ప్రమాదాలు జరుగకముందే కల్వర్టు, సైడ్వాల్ మరమ్మతు పనులు చేపట్టాలని, రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు.

వక్ఫ్ బోర్డును, రాజ్యాంగాన్ని రక్షించండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : వక్ఫ్ బోర్డును కాపాడండి, రాజ్యాంగాన్ని రక్షించండి అంటూ నంద్యాల ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బుధవారం నంద్యాల పట్టణ నూర్ బాషా సంఘం షాదిఖానాలో జేఏసీ కన్వీనర్ మౌలానా అబ్దుల్లా రషాది అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీసిసి జనరల్ సెక్రెటరీ చింతల మోహన్ రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు, సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్, బామ్సేఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. నిరంజన్, ఎస్డిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు హుస్సేన్ పీరా, వివిధ పార్టీ, ప్రజా సంఘాల నాయకులుమంజుల సుబ్బరాయుడు, మస్తాన్వలి, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షులు బాబాఫక్రుద్దీన్,డా. సుకుమార్, మౌలా నా రెహమాన్, మహమ్మద్ గౌస్, నరసింహ, సమీర్ పాస్టర్ కె.పాల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్, రాజ్యసభ లోను ఆమోదింప చేసుకున్న వక్ఫ్ సవరణ చట్టంతో ముస్లింలె వరూ సంతోషంగా లేరని, వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను చొప్పించడం, వేరే ఏ మత, దేవదాయ శాఖకు లేని కండిషన్ లు ఈ సవరణల ద్వారా చేయడం ముస్లింలపై వివక్షను చూపిస్తుం దని, యూజర్ బై తీసేయడం ద్వారా ముస్లింల వక్ఫ్ ఆస్తులను దేశ వ్యాప్తంగా కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నదని, ముస్లింలకు చెందిన ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు లీజుకు కట్టబెట్టడానికి ఇదంతా చేస్తున్నట్టు అభిప్రాయపడ్డారు. ఈ చట్టం వల్ల వక్ఫ్ భూములను ఆక్రమించిన వారే యాజమాన్యపు హక్కులను కలిగించడానికి ఈ చట్టం అవకాశాన్ని ఇస్తుందని, కేవలం మెజారిటీ మతస్థులను పోలరైజ్ చేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. ప్రభుత్వం ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం జేఏసీ గౌరవాధ్యక్షులు అబ్దుల్ సమద్, ఎస్ఎండి అబులైస్, ట్రెజరర్ ఎస్పీ బాష, కో కన్వీనర్ మస్తాన్, మీడియా సెక్రెటరీ ఉస్మాన్ బాష, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు దస్తగిరి, అక్బర్, మజీద్ ఖాన్, అబ్దుల్ మునీర్, అబ్దుల్ సలాం, అయ్యూబ్, హఫీజ్ సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎవరికి న్యాయం చేశాడని ఫుడ్ కమిషన్ చైర్మన్ పర్యటన

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా : నంద్యాల జిల్లాలో పర్యటిస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి గత 5సంవత్సరాల వైసీపీ పాలనలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల మెస్ చార్జీలు ఏమైనా పెంచాదా, నెలకు 3వేల వేతనం తీసుకొనే కార్మికుల వేతనాల పెంపుదలకు ఏమైనా కృషి చేశాదా, అంగన్వాడి, మిడ్డే మీల్స్ కార్మికుల బాధలు తీర్చాదా, ఎవరికి న్యాయం చేయడానికి ఫుడ్ కమిషన్ చైర్మన్ పర్యటిస్తున్నాడని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్ బాబు అన్నారు.బుధవారం జూపాడుబంగ్లాలోని ఏఐటియుసి కార్యాలయంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అనేక సార్లు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వేతనాలు పెంచాలని ప్రభుత్వానికి విన్నవించుకుంటున్న ప్రభుత్వాలు ఏమాత్రం స్పందించడం లేదని, గతంలో వేతనాల పెంపుకై మహిళ కార్మికులు ఆందోళనలు చేస్తున్న తరుణంలో అక్రమ అరెస్ట్,నిర్బంధాలతో ఉద్యమాలను అణిచివేసి కార్మికుల సమస్యలను పక్కన పెట్టారని వారు విమర్శించారు. కార్మికుల పైన పెత్తనం చెలాయిస్తున్న కమిషన్ చైర్మన్ కార్మికుల సమస్యలపై ఏమాత్రం స్పందించ లేదన్నారు. కార్మికుల శ్రమతో ప్రభుత్వాలు మంచి పేరు తెచ్చుకుంటున్నాయని శ్రమకు తగ్గ వేతనం ఇవ్వడం లేదని ఈ విషయంపై ఫుడ్ కమిషన్ చైర్మన్ ఎందుకు మాట్లాడటం లేదని వారు ప్రశ్నించారు. అంగన్వాడి మధ్యాహ్న భోజన పథకం కార్మికులు కనీస వేతనాలు లేక ఆందోళన బాట చేస్తూ ఉంటే ఫుడ్ కమిషన్ చైర్మన్ మాత్రం వారిపై చర్యలు తీసుకోవడానికి సిద్ధపడుతున్నాడని వారన్నారు. నాణ్యమైన భోజనం వడ్డించాలని చెబుతున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి 7రూ"కు ఒక పూట భోజనం వస్తుందా అని వారు ప్రశ్నించారు. హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన బియ్యం సరఫరా చేయడంలో ప్రభుత్వాలు విఫలం చెందాయని వారు అన్నారు. ఏమాత్రం మహిళా కార్మికుల మీద కనికరం ఉన్న ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రభుత్వంతో మాట్లాడి వేతనాలు పెంపుదల చేయాలని లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీ స్త్రీలకు పాలు,బ్రెడ్ పంపిణీ

విశాలాంధ్ర - ఆత్మకూర్ రూరల్ : పట్టణంలోని స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ నందు హెల్పింగ్ హాండ్స్ వారి ఆధ్వర్యంలో బుధవారం సుమారు 50మందికి పైగా గర్భిణీ స్త్రీలకు, డెలివరీ అయిన వారికి హాస్పిటల్ సూపర్ండెడ్ డాక్టర్ రాయుడు, డాక్టర్ లక్ష్మీప్రసన్న బాయ్ చేతుల మీదుగా హెల్పింగ్ హాండ్స్ టీం పాలు, బ్రెడ్ అందజేశారు. డాక్టర్ రాయుడు మాట్లాడుతూ హెల్పింగ్ హాండ్స్ ఇటువంటి మంచి కార్యక్రమాలు చేపట్టడం చాలా సంతోషకరమైన విషయమని భవిష్యత్తులో ఇటువంటి కార్యక్రమాలు ఇంకా ఎన్నో చేయాలని హెల్పింగ్ హాండ్స్ టీమ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ టీంమునవర్. రాజ్ పాల్ (ఏఎస్) షైక్ అహమ్మద్, నిరంజన్,హరికృష్ణ, లోకేష్,రాకేష్, కిరణ్, విశాలాంధ్ర రిపోర్టర్ హరీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరం

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : అప్పుడే పుట్టిన పిల్లలకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని డాక్టర్ విఆర్ కె నేడి అన్నారు. కోవెలకుంట్లలోని ఆరవ సెంటర్ అంగన్వాడి కేంద్రంలో బుధవారం పోషణ పక్వాడ కార్యక్రమాన్ని డాక్టర్ విఆర్ కెనేడి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు పిల్లల గురించి ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వెయ్యి రోజుల కేర్, రక్తహీనత తదితర అంశాలపై తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ చంద్రమ్మ, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

మంతెన వెంకటరామరాజు సేవలు మరువలేనివి

విశాలాంధ్ర - బనగానపల్లె : వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు సేవలు మరువలేనివని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి పేర్కొన్నారు.బుధవారం నాడు పట్టణంలోని ఏపీ మంత్రి క్యాంప్ కార్యాలయంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగాల నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య ఆధ్వర్యంలో ఏపీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బిసి ఇందిరా రెడ్డి చేతుల మీదుగా ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్న 11 మందికి లక్ష రూపాయలు విలువచేసే చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా బీసీ ఇందిరా రెడ్డి మాట్లాడుతూ మంతెన వెంకటరామరాజు చేస్తున్నటువంటి సేవలు చాలా గొప్పవిని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరిస్తున్నటువంటి టంగుటూరి సీనయ్యకు పెండేకంటి రమన్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బండి మౌలిశ్వర్ రెడ్డి,నాగేంద్రారెడ్డి,టీచర్ నాగరాజు, బత్తుల భాస్కర్ రెడ్డి, కటికవానికుంట బాలరాజు, నాగయ్య, పర్లపాటి చంద్ర, బండి వెంకటేశ్వర్లు, కలుగొట్ల అర్జున్ రెడ్డి,జనసేన భాస్కర్,టీచర్ ప్రతాప్,హరి, భరతుడు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యను బోలోపేతం చేయండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : అర్హతగల ఉపాధ్యాయుల పదోన్నతులతో ఇంటర్ విద్యను బోలోపేతం చేయాలని ఎస్టియు, నంద్యాల జిల్లా నాయకులు పేర్కొన్నారు. బుధవారం ఎస్టియు నంద్యాల జిల్లా కార్యాలయం నందు జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.మౌలాలి, అజాంబేగ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యారంగంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టడం హర్షనీయమని, అయితే గత 20 సంవత్సరాల నుండి ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ నిబంధనలు కోర్టులో పెండింగ్లో ఉండడంతో ఉపాధ్యాయులు మొత్తం సర్వీసులో కనీసం ఒక్క ప్రమోషన్ కూడా పొందకుండా పదవీ విరమణ చేస్తూ ఉంటే, నాన్ టీచింగ్ వారు 10 శాతం కోటాలో స్వీపర్ నుండి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ స్థాయికి పదోన్నతులు పొందడంతో నాణ్యమైన విద్య కొరవడి విద్యారంగం పూర్తిగా నిర్వీర్యం అవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటర్ కాలేజీల్లో కొన్ని కళాశాలలో కనీసం రెగ్యులర్ అధ్యాపకుడు కూడా లేదని, కావున ఇంటర్ విద్యకు పూర్వ వైభవం రావాలంటే కళాశాలలు పునః ప్రారంభం అయ్యే నాటికి అర్హత గల ఉపాధ్యాయులకు అడహాక్ సర్వీసు రూల్స్ ఆధారంగా జేఎల్ ప్రమోషన్లు కల్పించాలని, ఈ విద్యా సంవత్సరం ముగిసే లోపు టెన్ ప్లస్ పాఠశాలల విషయంలో కూడా తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు. అలాగే మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలల ఉపాధ్యాయులకు కూడా ప్రత్యేక బదిలీల షెడ్యూల్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బైలా కమిటీ కన్వీనర్ ఎస్. చంద్రశేఖర్, వెబ్సైట్ కమిటీ కన్వీనర్ నాగేంద్ర కుమార్, వీరప్ప, నాగరాజు, నాగేశ్వరనాయక్, సుబ్బరాయుడు, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

- పరిశ్రమల రాకను మంత్రి బీసీ అడ్డుకోలేదు
- కార్యకర్తలకు నోట్లో మట్టి కొట్టిందే వైసీపీ నేతలు
- కాటసాని విమర్శలపై టీడీపీ నేతలు ఫైర్

కక్ష్య సాధింపుల్లేవ్...

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : ప్రజా సంక్షేమం అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తున్నదని ఎక్కడ కక్ష్య సాధింపులు లేవని టిడిపి నేతలు తెలిపారు. సిమెంట్ పరిశ్రమల రాకను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎప్పుడూ వ్యతిరేకించలేదని రైతులకు న్యాయం చేసి పరిశ్రమను ఏర్పాటు చేసుకోవాలని ఉన్నాడు పబ్లిక్ హియరింగ్ లో తెలిపారని గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వైఎస్ఆర్సిపి కార్యకర్తల సమావేశంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని విమర్శించడం హాస్యాస్పదమన్నారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయం నందు టిడిపి మండల కన్వీనర్ మూలే రామేశ్వర రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి సంద్యాల రామేశ్వర రెడ్డి, వి ఆర్ లక్ష్మిరెడ్డి, జయలక్ష్మి రెడ్డి, కృష్ణ రంగారెడ్డి తదితరులు మాజీ ఎమ్మెల్యే కాటసాని విమర్శలపై ఫైర్ అయ్యారు. సిమెంట్ పరిశ్రమలలో తమ నాయకుల పనులను మంత్రి బిసి అండతో టిడిపి నేతలు నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నారని కాటసాని చెప్పడం కరెక్ట్ కాదన్నారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు అల్ట్రాటెక్,రాంకో సిమెంట్ పరిశ్రమలలో టిడిపి వారికి వర్కులు ఇవ్వలేదని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని, ఎర్రబోతుల కుటుంబం, అంకిరెడ్డిపల్లి కెపి రామ్మోహన్ రెడ్డి, చింతలాయపల్లి గురువిరెడ్డి కుటుంబం, కొలిమిగుండ్లలోని పేరం సత్యనారాయణరెడ్డి, కనకాద్రిపల్లి చంద్రశేఖర్ రెడ్డి, తుమ్మలపెంటలోని మల్లేశ్వర రెడ్డి, కలవటాల తిమ్మారెడ్డి తదితర నాయకులే సిమెంట్ పరిశ్రమలలో పనులు చేసుకుని కోట్లు సంపాదించుకొని కార్యకర్తల నోట్లో మట్టి కొట్టారని తెలిపారు. పార్టీ కార్యకర్తలకు అన్యాయం చేశామని కాటసాని స్వయంగా సమావేశంలోనే ఒప్పుకున్నాడని అలాంటివారు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి విమర్శిస్తే ప్రజలు నవ్వుకుంటారని తెలిపారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి నమ్ముకున్న ప్రతి టిడిపి కార్యకర్త కుటుంబానికి పరిశ్రమలలో ఉపాధి కల్పించారని అండగా నిలిచారని, రాబోయే మూడు నెలల్లో మరింత మందికి ఉపాధి పరిశ్రమలలో చూపిస్తారని తెలిపారు. నమ్ముకున్న కార్యకర్తలకు అన్యాయం చేసినది వైసిపి నేతలే అని అన్నారు. దాడులు చేసే సంస్కృతి ఎవరిదో నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసని, టిడిపి మండల కన్వీనర్ పైనే వైసిపి నేతలు దాడి చేసి అతనిపై కేసు నమోదు చేసిన ఘనత మీదేనని తెలిపారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సైగా చేస్తే నియోజవర్గంలో వైసిపి ఖాళీ అవుతుందని తెలిపారు. సమావేశంలో కోటపాడు శివరాం రెడ్డి, సత్యనారాయణ రెడ్డి,నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్ర రాజేశ్వరరావు సాధనకు కృషి

విశాలాంధ్ర -డోన్ : పోరాటాల యోధుడు అగ్ర నాయకుడు కామ్రేడ్ చంద్రా రాజేశ్వరరావు ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు అన్నారు. చంద్ర 31వ వర్ధంతిని డోన్ పట్టణంలో నక్కి రామన్న భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి రామ్మోహన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ సందర్భంగా వారు మాట్లాడుతూ 1914 జూన్6న ఆంధ్ర రాష్ట్రంలో మారుమూల గ్రామమైన కృష్ణాజిల్లా మంగలాపురంలో పుట్టిన చంద్ర రాజేశ్వరరావు ప్రపంచస్థాయి నేతగా ఎదిగారని ఆయన అన్నారు. దేశ స్వతంత్రం కోసంవివిధ దశల్లో జరిగిన ప్రజా మిలిటెంట్ ఉద్యమాలకు ఆయన నాయకత్వం వహించారని అన్నారు. చల్లపల్లి జమిందార్‌కి వ్యతిరేకంగా బెజవాడ రౌడీలకు కర్రలతో తరిమి కొట్టిన వీరుడు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు ఒక్క మనిషిని...మరో మనిషి శ్రమ దోపిడీ చేస్తున్న వారిని వ్యతిరేకించిన నాయకుడు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు అన్నారు. యావధార ఆస్తిని దారాదత్తం పేదలకు పంపిన చేసిన చరిత్ర ఆయనకు ఉందన్నారు. ఆయన ఆశయాలను లక్ష్యాలను ఇప్పుడున్న తరానికి తెలియజేయాలని ఆయన పోరాట పటిమను ముందుకు తీసుకెళ్దామని పార్టీ నిర్మాణం చేయడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అని వారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నారాయణ, జిల్లా సమితి సభ్యులు పులి శేఖర్, చేతి వృత్తిదారుల సమైక్య జిల్లా కార్యదర్శి రామ్మోహన్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి నాయకులు రజాక్,దివాకర్, సీసంగుం తల శాఖ కార్యదర్శి మనోహర్, దొరపల్లి శాఖ కార్యదర్శి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : సిపిఐ పూర్వ జాతీయ ప్రధాన కార్యదర్శి, ప్రజా ఉద్యమాల నిర్మాత, భూ పోరాట యోధులు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు 31వ వర్ధంతి సందర్భంగా స్థానిక సిపిఐ కార్యాలయంలో సీపీఐ నాయకులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. బాబా పక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘము జిల్లా కార్యదర్శి జి. సోమన్న, ఏఐటీయూసీ పట్టణ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు భూమని శ్రీనివాసులు, డి. శ్రీనివాసులు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రతాప్, ఆంధ్రప్రదేశ్ మహిళ సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు జి. లక్ష్మిదేవి, ఆంధ్రప్రదేశ్ మహిళ సమాఖ్య పట్టణ కన్వీనర్ సుశీలమ్మ, సిపిఐ జిల్లా సమితి సభ్యులు. జి.హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

విలువలున్న నాయకుడు మంత్రి ఫరూక్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నీతి, నిజాయుతీ, నిబద్ధత, విలువలున్న నాయకుడు మంత్రి ఫరూక్ అని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కితాబిచ్చారు. ఇటీవల మంత్రి ఫరూక్ సతీమణి మృతి చెందడంతో నంద్యాల టీడీపీ కార్యాలయంలో ఆయన మంత్రి ఫరూక్‌ను కలసి పరామర్శించారు. విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వక్ఫ్ బిల్లు విషయంలో జగన్ ఆడిన డబల్ గేమ్ ఆడడం అందరం చూసామని, రాజ్యసభలో ఒకలా, పార్లమెంట్‌లో మరోలా మద్దతిచ్చి ప్రజల్లో చులకన అయ్యారని ఆరోపించారు. జగన్ మోహన్ రెడ్డి రాజకీయం అంతా మోసం, దగానే అన్నారు. ఎన్టీఆర్ నుండి చంద్రబాబు వరకు అందరూ ఇరిగేషన్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, జగన్ ఇరిగేషన్ వ్యవస్థను నాశనం చేశాడని ఆరోపించారు. ఒక్క ఇరిగేషన్ శాఖలోనే 18వేల కోట్ల రూపాయల బిల్లులు బకాయిలు పెట్టాడన్నారు. అధికారం ఉన్నప్పుడు అడుగడుగునా 144సెక్షన్, పరదాలు వంటి ఆంక్షలు పెట్టాడని విమర్శించారు. ప్రతిపక్షానికి కూడా పనికి రావని ప్రజలే హోదా ఇవ్వకపోతే, ప్రతిపక్ష హోదా ఇవ్వాలని అడుగుతున్నాడని ఏద్దేవా చేశారు. ప్రజలు బుద్ది చెప్పినా జగన్‌కు ఇంకా బుద్ధి రాలేదని, అధికారులను బట్టలూడదీస్తానని అంటున్నాడని ఆరోపించారు. నంద్యాలలో సాగు నీటికి ఇబ్బంది లేకుండా మచ్చుమర్రి, హంద్రీ నీవా నుండి నీరు అందిస్తున్నామన్నారు.

వైసీపీ నేతపై హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులు అరెస్ట్

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ నియోజకవర్గం లోని సిరివెళ్ల మండలం గోవిందపల్లి గ్రామంలో ఈనెల 5 న సిరివెళ్ల మండల వైకాపా కన్వీనర్ ఇందూరి ప్రతాపరెడ్డి పై హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు జిల్లా ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా తెలిపారు. బుధవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా ఆళ్లగడ్డ డిఎస్పి ప్రమోద్ తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిందితులను విలేకరుల ఎదుట ప్రదర్శించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఈనెల 5న గోవిందపల్లె గ్రామంలో వైకాపా నాయకుడు ఇందూరు ప్రతాప్ రెడ్డి గుడికి వెళ్లి పూజ చేస్తుండగా నిందితులు గోవిందపల్లికి చెందిన గంగ దాసరి వెంకట రవిచంద్ర రెడ్డి, సంజామల మండలం పేరు సోముల గ్రామానికి చెందిన సంధ్య పోగుల పకీరయ్యలు వేట కోడవలతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. దీంతో గాయపడిన ఇందూరి ప్రతాప్ రెడ్డి ని నంద్యాల ఆసుపత్రికి అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ కి తరలించడం జరిగిందన్నారు. ప్రస్తుతము ఇందూరి ప్రతాప్ రెడ్డి కోలుకుంటున్నారన్నారు. నిందితుల ఆచూకీ కోసం ఆళ్లగడ్డ డి.ఎస్.పి బృందం గాలించి బుధవారం ఉదయం కానాలమెట్ట వద్ద అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. ఇద్దరు నిందితులతోపాటు మరో ముగ్గురు సహాయ సహకారాలు అందించినట్లు తమ దర్యాప్తులో తేలిందన్నారు. వారిని కూడా త్వరలోనే అదుపులోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సంఘటనకు సంబంధించి ఇద్దరు నిందితులనుంచి ఒక మోటార్ సైకిల్, రెండు వేట కొడవళ్ళు, ఒక సెల్ ఫోను స్వాధీనం చేసుకున్నామన్నారు. గతంలో 2017 సంవత్సరంలో ఇందూరి ప్రతాపరెడ్డి అన్న ఇందూరి ప్రభాకర్ రెడ్డి మరియు వారి బంధువు శ్రీనివాస్ రెడ్డిలను చంపిన కేసులో గంగా దాసరి వెంకట రవి చంద్రారెడ్డి నిందితుడు అన్నారు. అప్పటినుంచి నేటి వరకు ఇందూరి ప్రతాప్ రెడ్డికి, రవిచంద్ర రెడ్డికి మధ్య భేదాభిప్రాయాలు ఉన్నాయన్నారు. 2020 సంవత్సరం లో రవిచంద్ర రెడ్డి పై పీడియాక్టు పెట్టి కడప సెంట్రల్ జైలుకు తరలించినామన్నారు. గ్రామ ఆధిపత్యము కోసమే ఈ హత్యాయత్నానికి పాల్పడినట్టు తెలుస్తుందన్నారు. గ్రామంలో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో సమస్యలు పెద్దవి కాకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. యువత ముఖ్యంగా బెట్టింగ్ వ్యవహారాల జోలికి వెళ్ళవద్దని జీవితాలను పాడు చేసుకోవద్దని సూచించారు. గోవిందపల్లి కేసును చాకచక్యంగా చేదించిన ఆళ్లగడ్డ డిఎస్పి ప్రమోద్ , సిరివెళ్ల సిఐ వంశీధర్, ఎస్ఐ పీరయ్య మరియు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ నందు నేడు జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయం నందు జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను డిస్టిక్ స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి, కమిషనర్ నిరంజన్ రెడ్డి, ఎంఇ గుర్రప్ప, కో ఆర్డినేటర్ బాలవీరభద్రారెడ్డితో కలిసి మంత్రి ఎన్ఎండి ఫరూక్ పోస్టర్లను రిలీజ్ చేశారు. ఫరూక్ మాట్లాడుతూ పట్టణ, పరిసర ప్రాంత నిరుద్యోగ యువత ఈజాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 14కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొంటాయాని, దాదాపు 600కు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయన్నారు.

ఆయా కార్యక్రమాల్లో ఎంఈవోలు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండలంలోని తోళ్లమడుగు ప్రాథమిక పాఠశాల, మండల కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ లో నిర్వహించిన ఆయా కార్యక్రమాలలో ఎంఈవోలు అబ్దుల్ కలాం, రాజయ్యలు బుధవారం పాల్గొన్నారు. తోళ్లమడుగు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్యువల్ డే వారు పాల్గొని నాడు నేడు పనులు, పెన్నా సిమెంట్ ఆధ్వర్యంలో చేపట్టిన టాయిలెట్ పునరుద్ధరణ, పెయింటింగ్ వర్కులను పరిశీలించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. లిటిల్ ఫ్లవర్ ప్రైవేట్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు విమల ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్‌డేను నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆచరణాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం

విశాలాంధ్ర-పాణ్యం : ఆచరణాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం ఉంటుందని ఆర్జీయం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. కళాశాలలో ఐఐసి,ఆర్ అండ్ డి, సంయుక్తంగా విజనరీ వెంచర్స్ బిజినెస్ ప్లాన్ ఛాలెంజ్ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు కొత్త వ్యాపార ఆలోచనలతో పాల్గొని తమ ఆవిష్కరణలను ప్రదర్శించారు. ప్రాక్టికల్ అవగాహన మార్కెట్ అవసరాలు ఇన్నోవేషన్ సామర్థ్యం వంటి అంశాలపై నిపుణులు విద్యార్థులకు సూచనలు అందించారు. యువతలో ఆవిష్కరణ సామర్థ్యాన్ని వెలికి తీయడమే కాకుండా స్టార్టప్ సంస్కృతిని పరిచయం చేస్తాయన్నారు.ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ రామిరెడ్డి, ఆర్ అండ్ డి డైరెక్టర్ కృష్ణారెడ్డి ఇకాక్ కోఆర్డినేటర్ డాక్టర్ పివి గోపికృష్ణరావు,కన్వీనర్ టీ శాంతల పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి

విశాలాంధ్ర - రుద్రవరం : మండలంలోని మందలూరు గ్రామంలో విద్యుత్ షాక్ గురై రెండు పాడి గేదెలు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి వివరాల మేరకు బుధవారం గ్రామానికి చెందిన వీరభద్రుడు అనే రైతు మేత కోసం గేదెలను పెద్ద వంక వాగు సమీపానికి తీసుకొని వెళ్లారన్నారు. ఆ సమయంలో గేదలు నీరు త్రాగేందుకు వాగులోకి దిగాయన్నారు. ఈ సమయములో చేపల కోసం వాగులో కరెంటు తీగలను కొందరు వ్యక్తులు పడవేయడంతో ఆ తీగలను తగులుకొని రెండు గేదలు విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడేమృతి చెందాయి అన్నారు. దీంతో రైతుకు దాదాపు రూ 2 లక్షల విలువచేసే రెండు పాడి గేదెలను నష్టపోయారన్నారు. గతంలో కూడా చేపల కోసం కొందరు వ్యక్తులు పెద్ద వంక వాగులో కరెంటు తీగలు వేస్తున్నారని దీంతో పెద్ద సంఖ్యలో చేపలు కూడా మృతి చెందాయన్నారు. చేపల కోసం కరెంటు తీగలను ఎక్కడపడితే అక్కడ వాగులో వేయడం వల్ల పశువులకు మనుషులకు ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున ఇలా వేసే వారిని గుర్తించి వారిపై అధికారులుకఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆర్.ఓసీ.నెం 301/2015/ఎ1

పురపాలక సంఘము నంద్యాల
08.04.2025

పత్రిక ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది. పట్టణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా 2025-26 ఆర్థిక సంవత్సరమునకు సంబంధించి నంద్యాల పురపాలక సంఘము అధీనమందు గల డైలీ కూరగాయల మార్కెట్ గేట్స్ తేది: 22-04-2025 ఉదయం 10.30 గం॥లకు మరియు షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఖాళీగా వున్న షాపు రూములను తేది: 22-04-2025 ఉదయం 11.30 గం॥లకు పురపాలక సంఘ కార్యాలయమందు బహిరంగ వేలం పాటలు నిర్వహించబడునని తెలియజేయడమైనది.

వేలములు నిర్వహించు మునిసిపల్ మార్కెట్ వివరములు :

వ.సం	షాపు రూములు/మార్కెట్ వివరములు	లీజు కాలము
01.	డైలీ కూరగాయల మార్కెట్ గేట్స్	01-05-2025 నుండి 31-03-2026 అర్థ రాత్రి వరకు.

వేలములు నిర్వహించు మునిసిపల్ షాపు రూముల వివరములు :

వ.సం	షాపింగ్ కాంప్లెక్స్ పేరు	షాపు రూము నెం
1	పాత మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్	1N(FF), 4N-5N(FF), 6N-7N(FF) 8N-9N(FF)
2	మునిసిపల్ హైస్కూల్ దగ్గర	8(FF-ST), 11-12(FF)
3	ఆర్.ఎఫ్.రోడ్	1, 2, 3
4	సత్రంబడి	01, 05(FF), 06/(FF)
5	గర్ల్ హైస్కూల్ ప్రక్కన	03, 04, 08(FF), 09(FF)

సదరు బహిరంగ వేలమునందు పాల్గొనదలచిన వారు ఇతర వివరముల కొరకు మునిసిపల్ కార్యాలయములోని రెవెన్యు విభాగము నందలి ఎ1గుమాస్తాను కార్యాలయపు పని వేళలలో సంప్రదించగలరు మరియు పాటలో పాల్గొనదలచినవారు పాటకు 3 రోజుల ముందుగా సాల్వెన్సీని కార్యాలయములోని ఎ1 గుమాస్తాకు అందచేయవలసినదిగా తెలియజేయడమైనది.

కమీషనరు,
నంద్యాల పురపాలక సంఘము.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 10, ఏప్రిల్ 2025

ఘనంగా సీఆర్ 31వ వర్ధంతి వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: సీపీఐ పూర్వపు జాతీయ ప్రదాన కార్యదర్శి చంద్రా రాజేశ్వరరావు 31వ వర్ధంతి వేడుకలు బుధవారం సీఆర్ భవన్‌లో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి సీపీఐ నగరకార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. ముందుగా సీఆర్ చిత్రపటానికి సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు ఎన్.లెనిన్ బాబు, సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి ఎస్.మునెప్పలు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రరాజేశ్వరరావు భూపోరాటాల యోధుడని కొనియాడారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా 28 ఏళ్ల పాటు పదవిలో కొనసాగారన్నారు. భూస్వాముల కుటుంబం నుండి పుట్టిన రాజేశ్వరరావు తన సొంత భూములు పేదలకు పంపిణీ చేశారన్నారు. ఎంతో ఆదర్శవంతమైన జీవనం గడిపారన్నారు. తెలంగాణా సాయుధ పోరాటంలో వారికి అ ండగా నిలిచారని కొనియాడారు. రాజేశ్వరరావును నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయకార్యదర్శి ఎస్ మహేష్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శరత్, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు బీసన్న, కుమార్, నల్లన్న, మహిళా సమాఖ్య నగర కార్యదర్శి భారతి, ప్రజానాట్య మండలి జిల్లాకార్యదర్శి నాగరాజు, వివిధ ప్రజాసంఘాల నాయకులు రేణుక,రాము,విశాలాంధ్ర బ్రాంచిమేనేజర్ కె.నాగరాజు, విశాలాంధ్ర బ్యూరో ఇన్‌చార్జి కె.శ్రీనివాసులు గౌడ్, ఏఐవైఎఫ్ నగర నాయకులు అఖిల్, శివ, కలాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు

విశాలాంధ్ర-పత్తికొండ: ఆదర్శ కమ్యూనిస్టు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.రామచంద్రయ్య అన్నారు. బుధవారం స్థానిక చదువుల రామయ్య భవనంలో సీఆర్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పి.రామచంద్రయ్య మాట్లాడుతూ సీపీఐ ప్రధాన కార్యదర్శిగా పాతికేళ్లకుపైగా పనిచేసిన చంద్ర రాజేశ్వరరావు జీవితం ఆదర్శనీయమన్నారు. సమాజంలో దోపిడీలేని, సమ సమాజ నిర్మాణం స్థాపన కోసం దళితులు, బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధనకై చంద్ర రాజేశ్వరరావు నాయకత్వంలో అనేక ప్రజా ఉద్యమాలు చేపట్టడం జరిగిందన్నారు. కామ్రేడ్ సీఆర్ జీవితంలో అత్యంత ప్రాముఖ్యత సంతరించుకుందన్నారు. సీఆర్ అస్తమించే చివరి క్షణాల్లో తనకు ఆస్తిపాస్తులు లేవు, తాను ఎవరికీ ఏమీ ఇవ్వవలసిన అవసరం లేదన్నారు. పుస్తకాలు పార్టీకి, దుస్తులు అప్పులకు అని తమ వీలునామాలో పేర్కొన్నారని, పార్టీ శ్రేణులు ఆయన ఆశయ సాధనకు ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మాజీ జిల్లా కార్యదర్శి పి.భీమ లింగప్ప, మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, పార్టీ ప్రజా సంఘాల నాయకులు గురుదాస్, తిమ్మయ్య, ఉమాపతి, సురేంద్ర కుమార్, కృష్ణయ్య, నాగిరెడ్డి, నాగరాజు, విజయ్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

సం క్షి ప్తం

విశాలాంధ్ర - హొళగుంద: ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బుధవారం సెకండ్ ఇయర్ ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను కాలేజ్ ప్రిన్సిపాల్ కె.ప్రవీణ పంపిణీ చేశారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఆటపాటలతో పాటు సెల్ఫోన్లో గేమ్ లాడుతూ సమయాన్ని వృధా చెయ్యకుండా పాట పుస్తకాలను చదివితే భవిష్యత్తుకు ఎంతో అనుకూలమవుతుందన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణతో కలిగి ఉండాలని పుస్తకాలను చదివి సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకు బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-గూడూరు: తిమ్మగూడ స్వామి జాతర సందర్భంగా ఏడు రోజులపాటు విక్రయించే టెంకాయల వేలం పాటను స్థానిక కౌన్సిలర్ జింకల కుమారు రూ.96 వేలకు దక్కించుకున్నాడు. బుధవారం ఆలయంలో దేవదాయ కార్యానిర్వహణ అధికారి గురురెడ్డి టెంకాయల వేలం నిర్వహించగా 12 మంది వేటలం పాటలో పాల్గొన్నారు. వేలంపాటలో జింకల కుమారు అత్యధికంగా రూ.96 వేలకు దక్కించుకోవడంతో టెంకాయలు విక్రయం అనుమతిపత్రం అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ దేవదాయ శాఖ అధికారులు సూచించిన ధరలకే టెంకాయలను విక్రయించాలని, చట్ట విరుద్ధంగా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: అకస్మాత్తుగా తలెత్తే ఆరోగ్య సమస్యలపట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రాయలసీమ యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య ఎస్‌టీకే నాయక్ పిలుపునిచ్చారు. రాయలసీమ యూనివర్సిటీ జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన అవగాహనా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. విదార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ఆరోగ్యమే మహాభాగ్యం అని గమనించాల్సిందిగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేసిన డాక్టర్ ఎం. మనోజ్ కుమార్ మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో సీపీఆర్ చేసి రోగుల ప్రాణాలను ఏ విధంగా కాపాడాలో మోడల్స్ ఉపయోగించి ప్రాక్టికల్‌గా చూపించారు.

విశాలాంధ్ర - హొళగుంద: రైతులందరూ రీసర్వేకు అందరూ సహకరించాలని తహశీల్దార్ నిజాముద్దీన్ కోరారు. సులువాయిలో బుధవారం ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించే రీసర్వే గ్రామ సభ, అవగాహన ర్యాలీలు ప్రారంభిస్తూ ఆయన మాట్లాడుతూ రైతుల పొలం హద్దులను గుర్తిస్తామని రైతుల భూములను కొలతలు చేస్తామని అన్నారు. రీసర్వే సందర్భంగా రైతులకు ముందస్తుగా నోటీసులు జారీ చేస్తామని రీసర్వేలు ఎలాంటి అవకతవకులు జరగకుండా పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. ఏమైనా భూముల వ్యత్యాసాలు కనబడితే రైతులు తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించి, న్యాయమైన పరిష్కారం చేస్తామన్నారు.

విశాలాంధ్ర - ఆదోని రూరల్: పట్టణంలోని బీరప్ప కాలనీ, ఇందిరానగర్, హనుమాన్ నగర్, వాల్మీకి నగర్ కాలనీలలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించి ఆయా అంగన్వాడి కేంద్రాల పరిధిలో ఉన్న గర్భిణీలు, బాలింతలకు వెయ్యి రోజుల సంరక్షణలో భాగంగా తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలపై ఐసీడీఎస్ సూపర్వైజర్లు రాగిణి వసంత, సావిత్రి, మహాదేవి, స్వయంప్రభ పలు సూచనలు ఇచ్చారు. గర్భిణీ స్త్రీలు మొదటి రోజు నుండి పుట్టిన బిడ్డకు రెండు సంవత్సరాల వరకు తీసుకోవాల్సిన ఆహారం, టీకాలు, జాగ్రత్తలు, ఆరోగ్య పరీక్షలు, గంటలోపు ముర్రుపాలు,ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే అందించాలని వివరించారు. ఆరు నెలలు గడిచిన తర్వాత అనుబంధ పోషకాహార రెండేళ్ల వరకు అందించే పోషకాహార పరిమాణాన్ని పెంచుతూ కొనసాగించాలన్నారు.

విశాలాంధ్ర-పత్తికొండ: ఈనెల 15 వ తేదీ నుండి 18 వరకు తిరుపతిలో జరిగే ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు హనుమేష్ కోరారు. బుధవారం స్థానిక చదువుల రామయ్య భవనంలో ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి అల్తాఫ్, పట్టణ కార్యదర్శి విజయ్, నాయకులు మోహన్, పెదరాయుడు, ఇమ్రాన్, నబి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నగరంలో పన్నుదారుల సౌలభ్యం కోసం ఆస్తి పన్ను, తాగునీటి కొళాయి చార్జీలను చెల్లించేందుకు, వివిధ ప్రాంతాల్లో మూడు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను ఏకమొత్తం చెల్లింపులపై 5శాతం రాయితీ వర్తిసున్నందున, నగరపాలక సంస్థ కార్యాలయంలో పన్నుదారుల రద్దీ పెరిగిందన్నారు. పన్నుదారులు త్వరపడి తమ ఆస్తిపన్నుపై వచ్చే 5శాతం రాయితీని పొందుకొని, నగరాభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు.

విశాలాంధ్ర- వెల్దుర్తి: మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో జీవిస్తున్న తన కుల ధ్రువీకరణ పత్రం తొలగించారని టి.కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన కుల ధ్రువీకరణ పత్రం తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో చంద్రశేఖర వర్మకు తన కులధృవీకరణ పత్రాన్ని మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వంలో వలంటరీ ద్వారా జరిగిన తప్పిదం నేడు జిల్లా కలెక్టర్ ద్వారా రుజువు చేసుకోవాల్సిన పరిస్థితులు దాపరించాయని వాపోయారు. తనలాంటి బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాధికారాలను కోరారు. ఈ విధమైన తప్పు జరగడంతో తాను ఎస్సీ కార్పొరేషన్ లోన్‌కు దరఖాస్తు చేసుకోవడానికి వెళ్తే నాకుల ధ్రువీకరణ పత్రం పని చేయడం లేదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు తన కుల ధ్రువీకరణ పత్రం విషయంలో ప్రత్యేకమైన చర్యలు తీసుకుని తనకు న్యాయం చెయ్యాలని తెలిపారు.

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ముమ్మరంగా ఉపాధి హామీ పనులను కల్పించి, 90 శాతం లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుండి ఉపాధి హామీ, తాగు నీరు, రీసర్వే, గ్రామ, వార్డు సచివాలయాల కార్యకలాపాలు, పీజీఆర్ఎస్ అంశాలపై స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలు బాగా జరిగిందని, పనుల కల్పన, మెటీరియల్ కాంపొనెంట్ ఖర్చు లో 99 శాతం లక్ష్యాలను సాధించామన్నారు. కూలీలకు సగటు వేతనం రూ.286 ఇచ్చి రాష్ట్రంలో రెండవ స్థానంలో ఉన్నామని తెలిపారు. ఎంపీడీవోలు, ఏపీవోలు, డ్వామా సిబ్బంది, పంచాయతీ రాజ్ శాఖ అధికారులను అభినందించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్ఓ వెంకట నారాయణమ్మ, డ్వామా పీడీ వెంకట రమణయ్య, ఆర్డబ్ల్యూఎస్ఎస్ఈ నాగేశ్వరరావు, జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి పాల్గొన్నారు.

మే 16న వివాహం చేసుకోదలచిన వారికి నగదు పారితోషికం

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : తన జన్మదినాన్ని పురస్కరించుకొని మే 16వ తేదీన వివాహం చేసుకునే జంటలకు రూ.80 వేల ఆర్థిక సాయం అందించడం జరుగుతుందని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ తెలిపారు. వివాహ పారితోషకం అందుకునే వారి కొరకు అప్లికేషన్లను అందుబాటులో ఉంచిన కార్యాలయాన్ని మౌర్య ఇన్ నందు ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ తన జన్మదిన సందర్భంగా గత 30 ఏళ్లుగా సామూహిక వివాహాలు నిర్వహిస్తూ వస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఈ కార్యక్రమం కొనసాగిస్తామన్నారు. వివాహం చేసుకునే వధూవరులలో ఒకరు కర్నూలు నియోజకవర్గ పరిధిలో లేక పంచలింగాల, ఇ.తాండ్రపాడు, గొందిపర్ల, పూల తోట, దేవమాడ, దొడ్డిపాడు గ్రామాలకు చెందిన వారై ఉండాలన్నారు. అన్ని కులాల వారు ముస్లిం, క్రైస్తవులు సైతం వివాహాలు చేసుకుని వారితోషకం పొందడానికి అర్హులేనని ఆయన తెలిపారు. పారితోషికానికి దరఖాస్తు చేసుకునేవారు తమకు ఎలాంటి దురలవాట్లు లేవని, భవిష్యత్తులో చెడు అలవాట్లకు బానిసలు కామని డిక్లరేషన్ ఇవ్వవలసి ఉంటుందని టీజీ అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వధూవరులు ఇరువురు మేజర్లై ఉండాలని, వారికి నగదు పారితోషికంతో పాటు తాళిబొట్టు, కాలిమెట్టలు, పట్టు వస్త్రాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాశెట్టి శ్రీనివాసులు, వాయుగండ్ల సుబ్బారావు, కె.రామస్వామి, శ్రీకాంత్, బాలయ్య, పాల్ రాజ్, హర్షవర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెత్త బుట్టల పంపిణీలో అవినీతి

విశాలాంధ్ర - తుగ్గలి: మండలంలోని గ్రామాలలో ప్రతి పంచాయితీకి ఇంటింటికి తడి చెత్తకు ఒకటి, పొడి చెత్తకు ఒకటి చొప్పున ప్రతి కుటుంబానికి రెండు చెత్త బుట్టలు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే తుగ్గలి మండలంలోని కొన్ని గ్రామాలలో కుటుంబానికి ఒకటి చొప్పున పంపిణీ చేయడం, మరి కొన్ని గ్రామాల్లో కేవలం పబ్లిసిటీ కోసం పంపిణీ చేసి మొత్తం గ్రామంలో ప్రతి కుటుంబానికి రెండు చొప్పున పంపిణీ చేసినట్లు ప్రచారం చేస్తున్నారు. అసలు విషయానికొస్తే కొన్ని గ్రామాల్లో చెత్త బుట్టలు పంపిణీ చేయలేదని ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతుంటే ఇక్కడి అధికారులు, కొంతమంది గ్రామ నాయకులు వాటిని తుంగలో తొక్కుతున్నారు. ఈ విషయమై ఈఓఆర్డీ శ్రీహరిని వివరణ కొరడానికి ఫోన్ చెయ్యగా ఆయన స్పందించకపోవడం పట్ల అనుమానాలు మరింత బలమైతున్నాయని ప్రజల నుండి ఆదికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ప్రతి పంచాయతీలో ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వం అందించే పథకాలు అందుతున్నాయా, లేదా అని విచారించి అవినీతికి పాల్పడుతున్న పంచాయతీ కార్యదర్శులపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న డీలర్లపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో ఈకేవైసీ పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ తాలూకా అధ్యక్షులు జాఫర్ పటేల్, మండల కార్యదర్శి దస్తగిరి డిమాండ్ చేశారు. బుధవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం నందు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని కల్లుకుంట గ్రామంలో ఈకేవైసీ పేరుతో డీలర్లు డబ్బులు వసూలు చేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఆర్ఐ, తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని వారు ప్రశ్నించారు. గ్రామంలో దాదాపు రూ.70 వేల నుంచి రూ.80 వేల వసూలు చేసినట్లు తెలిపారు. ఓ పక్క ప్రభుత్వం ఈకేవైసీ పేరుతో డబ్బులు వసూలు చేస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని చెపుతున్నావని, అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. సబ్ కలెక్టర్ స్పందించి డీలర్లకు అవగాహన కల్పించి ఈకేవైసీ పేరుతో అక్రమంగా వసూలు చేసిన డబ్బులను ప్రజలకు వాపసు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజు, తిక్కన్న, గౌస్ పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడుతున్న బీఈడీ కాలేజీలపై చర్యలు తీసుకోవాలి



విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: రాయల సీమ యూనివర్సిటీ అనుబంధ బీఈడీ కళాశాలల్లో జరుగు తున్న అక్రమాలను అరికట్టాలని ఏఐ ఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.శరత్ కుమార్, ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి ఎస్.నాగార్జునలు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక వర్సిటీలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో ఉన్న అనుబంధ బీఈడీ కళాశాలల్లో అనేక అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టడంలో రాయలసీమ యూనివర్సిటీ అధికారులు పూర్తి వైఫల్యం చెందారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ వర్సిటీ నాయకులు ఈశ్వర్, యశ్వంత్, పవన్, నాయకులు సునీల్, కుమార్ తదతరులు పాల్గోన్నారు.

వీ కేర్‌తో బీ కేర్ ఫుల్ : ఏఐవైఎఫ్

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: వీ కేర్‌తో బీ కేర్ ఫుల్‌గా ఉండాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. హెయిర్ అండ్ స్కిన్ పేరుతో వీ కేర్ సెంటర్ యాజమాన్యం కలర్ ఫుల్ బ్రోచర్లతో, అందమైన వీడియోలతో యువతను ఆకర్షించేలాగా తప్పుడు ప్రకటనలు ఇస్తూ వీ కేర్‌కి వెళ్ళిన వారిని బురిడీ కొట్టిస్తున్న సంస్థపై చర్యలు తీసుకోవాలని, వీ కేర్ లాంటి సంస్థతో వీ కేర్ ఫుల్‌గా యువత ఉండాలని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కర్నూలు కొత్త బస్టాండ్ దగ్గరలో ఉన్న వీ కేర్ సెంటర్ ఎదురుగా ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు నాగరాజు అధ్యక్షతన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్నలు మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా చర్మవ్యాధులు నయం చేస్తామని తప్పుడు ప్రకటనలు చేస్తూ యువతను మోసం చేస్తున్నారని ఆరోపించారు. వీ కేర్ సెంటర్‌లను రాష్ట్ర వ్యాప్తంగా 72 బ్రాంచీలు ఏర్పాటు చేసుకొని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల నుండి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే వైద్యం నిర్వహిస్తూ ప్రజలను మోసలకు గురిచేస్తుంద వారు ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న సమస్యతో వెళ్లిన వారికి కౌన్సిలింగ్ రూపంలో అనేక మాయమాటలు చెప్పి దాదాపు లక్షల బిల్లులు వేస్తూ అంత కట్టలేమంటే మీకు ఆఫర్లు ఉన్నవి అంటూ మాయమాటలు చెబుతూ స్కిన్ సమస్యలకు లేజర్ ట్రీట్మెంట్లు తక్కువ నిర్వహిస్తామని, చికిత్సకు సంబంధించిన మొత్తం అమౌంట్ ఫస్ట్‌లోనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. తాము కట్టలేము అని ఎవరైనా చెబితే అవసరమైతే ఈఎంఐ పద్ధతిలో ఇస్తామని, తామే ఫైనాన్స్ చేస్తామని ఏమి తెలియని అమాయక ప్రజలను అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నారన్నారు. గత 20 రోజుల కింద డోన్‌కు చెందిన కస్టమర్ తనకు చికిత్స వద్దని ఎంత మొర పెట్టినప్పటికీ అతని బ్యాంకు ఖాతా నుండి ఈఎంఐ పేరుతో డబ్బులు కాజేస్తున్నట్లు సంఘటనలు కోకోల్లలుగా ఉన్నాయని తెలిపారు. వీ కేర్ సెంటర్‌పై చర్యలు తీసుకునేంతవరకు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో దశలవారి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగరనాయకులు అఖిల్, శివ, మద్దిలేటి, ఖాశీం, కృష్ణ, రవి, బాబ్జి, శివ రాముడు, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ ఉద్యోగులకు ఫీల్డ్ విధులనుండి మినహాయింపు

విశాలాంధ్ర - ఆదోని రూరల్: సచివాలయ దివ్యాంగ ఉద్యోగులకు ఫీల్డ్ విధుల నుండి మినహాయింపు ఇచ్చినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి దివ్యాంగ ఉద్యోగుల రాష్ట్ర కోఆర్డినేటర్ అమరేష్ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ వార్డు సచివాలయ దివ్యాంగ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలంటూ గతంలో ఎన్నో దఫాలుగా దివ్యాంగు ఉద్యోగుల సంఘం ప్రతినిధులు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, సచివాలయ శాఖ మంత్రి వీరాంజనేయులు, డిపార్ట్మెంట్ ఆఫ్ ఉమెన్ చిల్డ్రన్ వికలాంగుల, సీనియర్ సిటిజన్ శాఖ ప్రిన్సిపల్ సూర్య కుమారి, ఐఏఎస్ సచివాలయ శాఖ డైరెక్టర్ శివప్రసాద్ పలువురు ప్రభుత్వ ఉన్నత అధికారులకు వినతి పత్రాలు అందించడం జరిగిందని అమరేష్ గుర్తు చేశారు. సచివాలయ ఉద్యోగ దివ్యాంగులు ఇచ్చిన వినతి పత్రాలకు స్పందించి సోమవారం గ్రామ వార్డు సచివాలయ శాఖ డైరెక్టర్ శివప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లకు గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు అశ్వర్థ, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ప్రేమ్ సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగభూషణ రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటరత్నం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల సమస్యలను పరిష్కారిస్తాం

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలిపే ఓటర్ల సమస్యలను పరిష్కరిస్తామని కర్నూలు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. బుధవారం నగరపాలక కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. గత నెల సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రస్తావించిన సమస్యల పురోగతిని సమావేశంలో ఆర్వో వివరించారు. వెంకటరమణ ఓటర్లు కిడ్స్ వరల్డ్ సమీపంలోని పోలింగ్ బూత్‌లో ఉన్నట్లు, ఇందిరమ్మ కాలనీలో పోలింగ్ కేంద్రం లేదంటూ గత నెల సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రస్తావించారని ఆర్వో చెప్పారు. దీనిపై తగు చర్యలు చేపట్టామని, జోహరపురం ఇందిరమ్మ కాలనీలో 969 మంది ఓటర్లు ఉన్నట్లు గుర్తించామని, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు సమయంలో వారి కోసం అక్కడ ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు.

నేటి నుండి శ్రీకోన వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర - సి.బెళగల్: నేటి నుండి అనగా గురువారం పదో తారీకు నుండి 15వ తారీకు వరకు కోన వెంకటేశ్వర స్వామి తిరుణాల సందర్భంగా శ్రీ స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని ధర్మకర్తలు, గ్రామ పెద్దలు తెలిపారు. స్వస్తిశ్రీ శ్రీ విశ్వావస నామ సంవత్సరం చైత్ర శుద్ధ త్రయోదశీలు మొదలుకొని చైత్ర బహుళ విధియలు మంగళవారం వరకు పంచరాత్రి ఆగమన పద్ధతిన శ్రీకోన వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. 10న గురువారం గరుడోత్సవం, 11న శుక్రవారం శ్రీవారి కల్యాణ మహోత్సవం, ప్రభోత్సవం, 12న శనివారం సంపూర్ణ రథోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 13న ఆదివారం పారువేట, 14న సోమవారం వసంతోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని గ్రామ పెద్దలు తెలిపారు.

అన్ని ధర్మాలను అందరూ గౌరవించాలి : జేసీ

విశాలాంధ్ర - హొళగుంద: ఈ నెల 12న జరిగే హనుమాన్ శోభాయాత్రను అందరూ సహకరించి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆదోని డివిజన్ సబ్ కలెక్టర్ మంత్రి మౌర్య భారద్వాజ్ సూచించారు. పోలీస్ స్టేషన్లో బుధవారం ఎస్సై దిలీప్ కుమార్ అధ్యక్షతనలో పీస్ కమిటీ సమావేశం జరిగింది. సబ్ కలెక్టర్ మంత్రి మౌర్య భరద్వాజ్ మాట్లాడుతూ గతంలో జరిగిన చెడు సంఘటన మళ్లీ పునరా వృతం కాకుండా చూడాలని, శాంతి భద్రతలు క్షీణించకుండా గ్రామ పెద్దలు, ప్రజలు ఒకరికొకరు సహకరించుకొని గౌరవించుకొని పండుగను విజయవంతం చేయాలని కోరారు. గొడవలు, ఘర్షణలు జరిగితే గ్రామ ప్రజలు వెంటనే పరిష్కరించి శాంత పరచాలని కోరారు. ఎవరైనా మాట వినకపోతే తమ దృష్టికి తీసుకువస్తే అలాంటి వారికి కౌన్సిలింగ్ చేయించి సరిదారిలో వచ్చేలా చూస్తామన్నారు. హనుమాన్ శోభాయాత్ర ఇచ్చిన మ్యాప్ ప్రకారంగా వెళ్లాలని, చట్టాలను అధిగమిస్తే ఊరుకో మని స్పష్టం చేశారు. పీస్ కమిటీలో సీఐ శివ శంకర్ రెడ్డి, ఎస్సై దిలీప్ కుమార్, తహశీల్దార్ నిజాముద్దీన్, ఎంపీడీఓ విజయ లలిత, ఈవోఆర్‌డీ చక్రవర్తి, గ్రామ కార్యదర్శి రాజశేఖర్ గౌడ, గ్రామ పెద్దలు రాజా పంపన గౌడ, డాక్టర్ తిప్పయ్య, తోక వెంకటేష్, దుర్గప్ప, వీరన్న గౌడ, ప్రసాద్, మహేష్, ఉల్లిగన్న దిడ్డి తిక్క స్వామి, అశోక్,వరాల వీరేష్, కొలిమి వహీద్, డీఎస్ బాష, అబ్దుల్లా, శాలి ఫక్రుద్దీన్ సాబ్, మోయిన్, ఆమీన్, ఈసా, ఆదం, జాంటీ వీరేష్, కృష్ణయ్య,

మైనార్టీలను అణిచి వేసేందుకు వక్ఫ్ సవరణ

విశాలాంధ్ర - ఆదోని క్రైం: దేశంలో ముస్లింలను అణిచివేసేందుకే బీజేపీ కూటమి వక్ఫ్ సవరణ బిల్లును ఆమోదించిందని, ముస్లిం సమాజానికి నష్టం కలిగే విధంగా వక్ఫ్ బిల్లు ఉందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్ బాబు అన్నారు. బుధవారం నిజాముద్దీన్ కాలనీ యందు సీపీఐ ఆధ్వర్యంలో మతోన్మాద విధానాలను వ్యతిరేకిస్తూ భారత రాజ్యాంగ పరిరక్షణకై పోరాడుదాం అంటూ కాలనీలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్, జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్ బాబు మండల కార్యదర్శి కల్లుబావిరాజు తదితరులు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మారుస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. మార్చి 23 భగత్ సింగ్, రాజు గురు, సుకుదేవ్‌ల వర్ధంతి పురస్కరించుకొని వారి స్ఫూర్తితో ఈనెల 14వ తేదీ అంబేద్కర్ జయంతి వరకు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పట్టణంలో పెద్ద ఎత్తున ప్రచారం ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. దేశంలో మైనార్టీలను క్రైస్తవులను, ఎన్డీఏ ప్రభుత్వం నిత్యం ఇబ్బందులకు గురి చేస్తుందని సమాజానికి చంద్రబాబు, నితీష్ కుమార్, తీరని ద్రోహం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు మెకానిక్ వలి, మన్సూర్, ఈరప్ప, మహమ్మద్ పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో..

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 10, ఏప్రిల్ 2025

జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తా

విశాలాంధ్ర - కోడుమూరు : భూమి వివరాల ఆన్లైన్ అడంగల్ నమోదు సమస్యపై చాకలి హైమవతి అనే మహిళ మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ వెంకటేష్ నాయక్ వద్ద వీఆర్వోలు లక్షల లంచం తీసుకొని, లైంగికంగా వేధిస్తున్నారు అంటూ ఆరోపణలు చేస్తూ విష ద్రావణం తీసుకొని ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించిన ఘటనపై కర్నూలు ఆర్డీవో కె.సందీప్ కుమార్ బుధవారం కోడుమూరు తహశీల్దార్ కార్యాలయం చేరుకొని విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా తహశీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో సందీప్ కుమార్ ఎదుట హాజరైన చాకలి హైమావతిని ఆయన ఘటనపై ఆరా తీశారు. వీఆర్వోలు తన వద్ద నుంచి లక్ష రూపాయలు డబ్బులు తీసుకున్నారని, అంతేకాకుండా తమ భూమి వివరాలు ఆన్లైన్ అడంగల్ నందు నమోదు చేసేందుకు కోరిక తీర్చాలని పాలకుర్తి గ్రామం వీఆర్ఓ వెంకటరాముడు,కోడుమూరు పట్టణం వీఆర్వో పరమేష్, పులకుర్తి గ్రామం విఆర్ఓ నారాయణ అనే ముగ్గురు వీఆర్వోలు లైంగికంగా వేధిస్తున్నట్లు ఆమె ఆరోపించారు. విచారణ అనంతరం ఆర్డీవో కె.సందీప్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ప్యాలకుర్తి గ్రామానికి చెందిన చాకలి పెద్ద సవారి అనే వ్యక్తికి వెంకటేశ్వరమ్మ, ఎల్లమ్మ, రాములమ్మ ముగ్గురు భార్యలు ఉన్నారన్నారు. చాకలి పెద్ద సవారి రెండవ భార్య రాములమ్మ సంతానం అయిన చాకలి హైమావతికి, మరో భార్య ఎల్లమ్మకు సంతానం అయిన చాకలి సుధాకర్ అనే వ్యక్తికి మధ్య సదరు భూమి ఆస్తిపై సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో వివాదం నడుస్తోందన్నారు. ఈ నేపథ్యంలోనే చాకలి హైమావతికి కోర్టు ఉత్తర్వులు మేరకు సంక్రమించిన దాదాపు 4 ఎకరాల భూమి వివరాలు ఆన్లైన్ అడంగల్ నమోదు చేసేందుకు తహశీల్దార్ స్థాయిలో అధికారులు లేవని చెప్పారు. 2024లో చాకలి హైమావతి అర్జీ మేరకు అప్పటి తహసిల్దార్ జయన్న ఆన్లైన్ అడంగల్ నందు భూమి వివరాలు నమోదు కోసం జాయింట్ కలెక్టర్‌కు నివేదికలు సమర్పించినట్లు ఆయన వివరించారు. ఘటనపై పూర్తి నివేదిక త్వరలో జిల్లా కలెక్టర్‌కు అందజేస్తానని ఆర్డీవో తెలిపారు. ఇదిలా ఉండగా ప్రస్తుత తహశీల్దార్ వెంకటేష్ నాయక్ కోడుమూరు తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఇప్పటివరకు చాకలి హైమావతి తన భూమి వివరాలు ఆన్లైన్లో నమోదు చేయాలని కోరుతూ ఎలాంటి అర్జీ తహశీల్దార్ వెంకటేష్ నాయక్ దృష్టికి తీసుకెళ్లకపోవడం గమనార్హం. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ వద్ద రూ.10 వేలు లంచం తీసుకున్నారని ఆరోపించడంతోపాటు కోడుమూరు గ్రామానికి సంబంధంలేని వీఆర్వోలు నారాయణ, పరమేష్‌లపై లైంగికంగా వేధిస్తున్నారంటూ ఆరోపణలు చేయడం నిరాధారమైన ఆరోపణలేనని కోడుమూరు పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు.

నిషేధిత కాలుష్య కార్బైడ్ ద్వారా పండ్లను మాగించొద్దు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ప్రభుత్వం నుండి అనుమతులున్న పౌడర్లు మాత్రమే వాడి మామిడి పండ్లను మాగించాలని, తగిన టెంపరేచర్ లో పెట్టి మామిడి కాయలను పండ్లుగా మార్చాలని, అందుకు ఏసి గోడౌన్లను ఉపయోగించుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగ రాజు, మార్కెటింగ్ ఏడి ఎస్ అబ్దుల్ రహమాన్, ఫుడ్ సేఫ్టీ అధికారులు ఒ.వెంకట రాముడు, కాసింలు తెలిపారు. ఫుడ్ సేఫ్టీ డిపార్ట్మెంట్, ఉద్యాన శాఖల ఆధ్వర్యంలో నిషేధిత కాల్షియం కార్బైడ్ వినియోగంపై బుధవారం పండ్ల వ్యాపారస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ జిల్లాధికారులు వెంకటరాముడు, కాశీమ్ వలి, ఉద్యానశాఖ జిల్లా అధికారి నాగరాజు, మార్కెటింగ్ జిల్లా అధికారి ఎస్ఏ రహిమాన్, మున్సిపల్ అసిస్టెంట్ కమీషనర్ వెంకటదాస్, ఫ్రూట్స్ అసోసియేషన్ నాయకులు అల్తాఫ్ హుస్సేన్, పండ్ల వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉద్యానశాఖ అధికారి నాగరాజు మాట్లాడుతూ ఏసీ గోడౌన్లలో కాయలను మాగపెట్టడం మంచిదని, తగిన మోతాదులో ఉష్ణోగ్రతల నుంచి మామిడి, అరటి వంటి పళ్ళను మాగ పెట్టాలన్నారు. అంతకుమించిన ఉష్ణోగ్రతలలో పండ్లను మాగ పెడితే తరువాత పురుగులు వస్తున్నాయని వ్యాపారాలు పేర్కొనడంపై వారి సందేహాలను నివృత్తి చేశారు. రైతులకు కూడా అవగాహన కల్పించడం జరుగుతుందని, రాష్ట్రంలోనే మొదటి సారిగా నంద్యాల జిల్లాలో రైపనింగ్ చాపర్ పెట్టామని, రైపనింగ్ చాపర్లోనే పండ్లు పెడుతున్నామని, అవి పెట్టుకోవడానికి ముందుకు వస్తే అలాంటి వ్యాపారస్థులకు, రైతులకు ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా 30 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి వెంకటరాముడు మాట్లాడుతూ ఫుడ్ సేఫ్టీ కమీషనర్ ఆదేశాల మేరకు పండ్ల వ్యాపారస్థులకు అవగాహన కల్పిస్తున్నామని, నిషేధిత కాల్సియం కార్బైడ్ ను వాడకూడదన్నారు.

మారెమ్మ దేవర ఉత్సవాల్లో కిక్కిరిసిన భక్త జనం

విశాలాంధ్ర - సి.బెళగల్: మండల పరిధిలోని తిమ్మందొడ్డి గ్రామంలో బుధవారం మారెమ్మ దేవర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దల, గ్రామస్తుల సమక్షంలో గ్రామ ప్రజలు మారెమ్మ గుడి దగ్గరకు బోనాలతో వెళ్లి అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాలలో పోటెత్తిన భక్తులు, బంధువులతో, ప్రజలతో గ్రామం కిక్కిరిసి పోయింది. అమ్మవారి గుడి దగ్గర బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకొని ఇళ్లకు ఉత్సవ బోనాలు వెళ్లే వరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బెళగల్ ఎస్సై తిమ్మారెడ్డి తమ పోలీసు సిబ్బందితో గట్టి నిఘా చర్యలు చేపట్టారు. గ్రామంలో ప్రజలకు భక్తులకు తాగునీటి కొరత లేకుండా, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా గ్రామ పెద్దలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సౌకర్యాలు కల్పించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

బీవీ స్మారక క్రికెట్, టోర్నమెంట్ పోటీలు

విశాలాంధ్ర -గోనెగండ్ల: బీవీ సార్మక క్రికెట్, టోర్నమెంట్, సమ్మర్ స్పెషల్ సందర్భంగా వేముగోడు, తిప్పనూరు, గ్రామాల్లో టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలుగు యువత మండల అధ్యక్షులు రంగస్వామి నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు వేముగోడు పి.సత్యనారయణ స్వామి, తంబలి అశోక్ కుమార్, పెద్దమర్రివీడు కుర్వ మల్లయ్యలు ఈ పోటీలు ప్రారంభించారు. ఈ టోర్నమెంట్ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు, టీడీపీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు జిల్లా స్థాయి క్రికెట్, టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఆసక్తి గల క్రీడాకారులు రూ.600 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సందీప్ నాయుడు, టీఎన్ఎస్ఎఫ్ తాలుకా అధ్యక్షులు నాగరాజు, కుర్వ జైపాల్, కైరవాడి పెద్దయ్య, టీడీపీ గ్రామ అధ్యక్షులు లక్ష్మి నరసింహ, పెద్దమర్రివీడు ఈరన్న గౌడ్, క్రీడాకారులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

గద్దెరాల్ల మారెమ్మకు గోదానం

విశాలాంధ్ర - ఆదోని రూరల్: దేవనకొండ మండలం గద్దెరాల్ల గ్రామంలో వెలిసిన గద్దేరాళ్ళ మారెమ్మ దేవతకు ఆదోని వాసులు బొగ్గరు కృష్ణమూర్తి, పార్వతమ్మ కుటుంబ సభ్యులు డా.మధుసూదన్, డా.సంధ్య, రవికుమార్, సుమలత, గిరిప్రసాద్, మాధవి, అయ్యన్న పలువురు కుటుంబ సభ్యులు గోమాతను ఆలయ కమిటీ సభ్యులు సూరన్న, రామకృష్ణ, నెట్టెకల్లు, రామచంద్ర, ఎల్లప్ప, వీరేష్‌లకు అందజేసి మొక్కులు తీర్చుకున్నారు. నమ్మకాన్ని ఉంచి ప్రేమాను రాగాలతో గద్దెరాల్ల మారెమ్మను పూజిస్తే కోరిన కోరికలు తీరుతాయని, తమ కోరికలు తీరినందుకే గోమాతను దానం చేయడం జరిగిందని దాతలు మీడియాకు తెలిపారు. హిందూ సంప్రదాయంలో గోమాతకు ప్రత్యేక స్థానం ఎంతో గొప్పదన్నారు. గోమాతను దానం చేయడం ఎంతో అదృష్టంగా భావిస్తామన్నారు.

ఎక్సేంజ్ కార్యాలయంలో ద్విచక్ర వాహనాల వేలం

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్: ప్రొహిబిషన్, ఎక్సైజ్ సుపెరింటెంట్ ఎస్ రవి కుమార్ ఆదేశాల మేరకు ఏఎస్ఎస్‌టీ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సుపెరింటెంట్ ఆధ్వర్యంలో 11.04.2025 శుక్రవారం ఉదయం 11.00 గంటలకి ఆత్మకూర్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో వివిద కేసుల యందు సిజు చేయబడిన 3 ద్విచక వాహనములు వేలం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి కలవారు ఆత్మకూర్ ప్రొహిబిన్, ఎక్సైజ్ స్టేషన్ నందు ద్విచక వాహనములు వేలంలో ప్రజలు పాల్గొనవాలసినదిగా ఎక్సేంజ్ సీఐ కిషోర్ కుమార్ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ ప్రణాళికపై సమన్వయ సమావేశం

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : మండల పరిధిలోని వెలుగు ఆఫీస్ నందు బుధవారం వ్యవసాయ శాఖ,అనుబంధ శాఖ సిబ్బంది, వెలుగు ఇబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ కార్యాచరణ ప్రణాళికపై సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమా వేశానికి మండల వ్యవసాయ అధికారి నిరంజన్, వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ శేఖర్ వెలుగు సీసీలు, ఆర్ఎస్‌కె ఇన్చార్జిలు, వెలుగు విఓబిలు, విఓఏలు, రైతులు మొదలైన వారికి అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి నిరంజన్ మాట్లాడుతూ రైతులు వ్యవసాయంలో ఎక్కువగా రసాయన మందులు, పురుగు మందులు వినియోగిస్తున్నారని తద్వార ఆహార ధాన్యాలు, కూరగాయలు, భూమి కలుషితం అవ్వడం వలన మానవాళి ఆరోగ్యం దెబ్బతింటుందని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను మరల్చడానికి ఎంతో చేస్తుందని, గ్రామాల్లో ప్రతి రైతు ను కలిసి ప్రకృతి వ్యవసాయం గురించి తెలియచేసి అందరూ రైతులు 365 రోజులు తమ పొలాల్లో పంటలు ఉండేలా చూడాలని భూమిలో పోషకాలు పెరిగి పంటల దిగుబడి పెరుగుతుందని, రైతు సేవా కేంద్ర సిబ్బంది మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అందరూ కలిసి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని తీసుకెళ్లాలని చెప్పడం జరిగింది. ప్రకృతి వ్యవసాయ విభాగం ఎన్ఎఫ్ ఎ రామకృష్ణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవ సాయంలో పండించిన పంటలను ఆహార పదా ర్థాలుగా తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటాము అన్నారు. ఖరీఫ్ ప్లాన్‌లు వెలుగు సిబ్బంది సహ కారం అందించాలన్నారు. సంఘ సభ్యులు నిరుపేద మహిళలందరూ ప్రకృతి వ్యవసాయం పాటించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక మహిళా సంఘాలకు చేపడుతున్నప్పుడు వెలుగు సిబ్బంది, ఆర్ఎస్‌కె సిబ్బంది ఆధ్వర్యంలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు పోవాలని, గ్రామాల్లో ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయడానికి మన అందరి భాగస్వామ్యం ఎంతో ముఖ్యమన్నారు.

ప్రజా దర్బార్‌లో పాల్గొన్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్, అబ్జర్వర్ రవికుమార్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: టీడీపీ కార్యాలయం నందు ప్రజా సమస్యల పరిష్కారానికై రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, టిడిపి నంద్యాల అబ్జర్వర్ పోతురాజు రవికుమార్‌లు ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఫరూక్, రవి కుమార్ లు మాట్లాడుతూ వ్యక్తిగత, సామాజిక అంశాలపై అర్జీలను ప్రజల నుంచి స్వయంగా స్వీకరించామని, ప్రతి ఒక్కరి సమస్యలను సావధా నంగా విని వెంటనే అధికారులకు ఫోన్ తెలిపి సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రతి బుధవారం ఒక మండల కేంద్రంలో జరిగే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఆయా మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని, వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీసిందన్నారు. టీడీపీ ముఖ్య నాయకులతో సమావేశమైన అబ్జర్వర్ పోతురాజు రవికుమార్, టీడీపీ కార్యాలయం నందు టిడిపి ముఖ్య నాయకులు, వార్డు ఇన్చార్జిలతో నంద్యాల టీడీపీ అబ్జర్వర్ పోతురాజు రాజకుమార్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ చంద్ర బాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కేఎస్ఎస్ టీడీపీలో ప్రతి ఒక్కరూ కేఎస్ఎస్ సభ్యులుగానే ఉండాలన్నారు. క్లస్టర్, యూనిట్, బూత్ (క్యూబ్) కమిటీల్లో ఏదో ఒక దానికి కన్వీనర్‌గా ఉండాలని, కేఎస్ఎస్ సభ్యుడిగా ఉండి పార్టీకి మెజార్టీ సాధిస్తేనే ఎన్నికల్లో పోటీకి అర్హుడని తెలిపారు. పురుషులతో పాటు మహిళలు సమానంగా నాయకత్వం పెరగాలని చంద్రబాబు సూచించినట్టు తెలిపారు. కేఎస్ఎస్ లుగా వారికి కేటాయించిన 60 మంది బాగోగులను కేఎస్ఎస్ సభ్యులు పట్టించుకోవాలన్నారు.

గృహ నిర్మాణాలకు దరఖాస్తులు

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా: మండలంలోని గృహ నిర్మాణాలకు ఆయా గ్రామ పంచాయతీల నుండి 1098 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నట్లు హౌసింగ్ ఏఈ జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా ఏఈ జ్యోతి మాట్లాడుతూ లబ్ధిదారుల దరఖాస్తు ఫారాలు మంజూరు నిమిత్తం ప్రతిపాదనములు ప్రభుత్వానికి పంపినట్లు ఆమె తెలిపారు. గృహ నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు హౌసింగ్ ఏఈ కార్యాలయంలో కుల,ఆదయ, పొజిషన్ సర్టిఫికెట్లను అందజేయాలని ఆమె తెలిపారు. ధన మంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం ద్వారా గృహ నిర్మాణం మంజూరు చేసిన అర్జిదారులు ప్రధానమంత్రి ఆవాస్ యోజన2.0 పథకం కింద వెబ్ పోర్టల్ నందు అప్లోడ్ చేయాలన్నారు. అందువలన గృహ నిర్మాణం కోసం దరఖాస్తులు లబ్ధిదారులు తప్పనిసరిగా ఇంటి నిర్మాణ స్థల ధ్రువీకరణ పత్రాలు కులా మరియు ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని ఆమె తెలిపారు. జిల్లా కలెక్టర్, ప్రాజెక్ట్ డైరెక్టర్ గృహ నిర్మాణ సంస్థ నంద్యాల ఆదేశాల ప్రకారం ఇంటి నిర్మాణ ఆదాయ దృవీకరణ పత్రాలు పొజిషన్ పత్రాలు కుల దృవీకరణ పత్రాలు తీసుకొని హౌసింగ్ ఆఫీసులో అందజేయాలని ఆమె తెలిపారు. ఆయా గ్రామాలలోని సంబంధిత సచివాలయాల వీఆర్వోలను, మండల తాసిల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని ఏఈ జ్యోతి ప్రజలకు తెలియజేశారు. లబ్ధిదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలియజేశారు.

వెట్ ల్యాండ్‌లను గుర్తించి నివేదిక అందచేయాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లాలో గుర్తించిన వెట్ ల్యాండ్‌లపై నివేదిక అందచేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా వెట్ ల్యాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వెట్ ల్యాండ్ రూల్స్ 2017 ప్రకారం జిల్లాలో వెట్ ల్యాండ్ సంరక్షణ, నిర్వహణ కోసం జిల్లా వెట్ ల్యాండ్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నీరు నిలువ ఉండే ప్రాంతాలు సహజ మైన లేదా కృత్రిమ, శాశ్వతమైన లేదా తాత్కాలిక, స్థిరమైన లేదా ప్రవహించే, తాజా, సముద్ర నీటి ప్రాంతాలతో సహా, తక్కువ అలల తో లోతు ఆరు మీటర్లు గల నీటి సముదాయాలను వెట్ ల్యాండ్ కింద పరిగణించ బడుతుందని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న వెట్ ల్యాండ్ వివరాలను సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. జిల్లాలో 333 వెట్ ల్యాండ్స్ ఉన్నట్లు స్పేస్ అప్లికేషన్ సెంటర్ అట్లాస్ గుర్తించిందని, ఆ మేరకు భూముల సరిహద్దులతో పాటు గ్రౌండ్ ట్రూతింగ్ తదితర వివరాలతో వారంలోపు నివేదిక సమర్పించాల్సిందిగా జిల్లా కలెక్టర్ రెవెన్యూ, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వెట్ ల్యాండ్ కమిటీ సభ్యులు జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, డీఎఫ్ఓ శ్యామల, ఇరిగేషన్ ఎస్ఈ ద్వారకనాథ్ రెడ్డి,ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ నాగేశ్వర రావు, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి ,జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్, కర్నూలు అడిషనల్ మున్సిపల్ కమిషనర్ కృష్ణ, పొల్యూషన్ కంట్రోల్ ఈఈ కిషోర్ రెడ్డి, జిల్లా టూరిజం అధికారి విజయ పాల్గొన్నారు.

బీజేపీ పథకాలతో రాష్ట్రాలు అభివృద్ధి

విశాలాంధ్ర - శిరివెళ్ల : కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ప్రవేశపెడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలతో రాష్ట్రాలు అభివృద్ధి చెందుతున్నయని ఆళ్లగడ్డ తాలూకా బిజెపి కన్వీనర్ మందుల రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో శిరివెళ్ల మండల బిజెపి కన్వీనర్ తపస్వి విజయ్ కృష్ణ అధ్యక్షతన బుధవారం పార్టీ క్రియాశీలక సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మందుల రామకృష్ణ మాట్లాడుతూ బీజేపీ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాల పట్ల విస్తృత ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర బీజేపీ క్రియాశీలక సభ్యులు లింగన్న, మైనారిటీ మోర్చ అధ్యక్షులు షేక్ వలి, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో రైతులకు లాభదాయకం

విశాలాంధ్ర - వెలుగోడు: వెలుగోడు గ్రామం నందు మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ ఆధ్వర్యంలో మట్టి నమూనా సేకరణ పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించుకుని వాటి ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందని, భూసార పరీక్షల ద్వారా వ్యవసాయ క్షేత్రాల్లోని ఉదజని లవణా సూచిక లక్షణాలు, నత్రజని , భాస్వరం పొటాష్ల లభ్యత తెలుసుకొని అవసరమైన మోతాదులో ఎరువులు వినియోగానికి రైతులకు భూసార పరీక్షలు ఉపయోగపడతాయని ఏఓ తెలిపారు. ప్రస్తుతం మండలంలో రబి పంటలు వరి మినహా ఇతర పంటలు కోతలు ముగిసాయి. కావున వేసవిలో భూములు ఖాళీగా ఉన్నందున భూసార పరీక్షలకు ఇది సరైన సమయమని ఏఓ తెలిపారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి భూసార పరీక్షలు చేయించుకోవాలని, క్షేత్రస్థాయిలో సిబ్బందికి రైతులకు మట్టి నమూనాలను ఎలా సేకరించాలన్న విషయం వివరించారు. ప్రతి ఎకరాకు 8 చోట్ల మట్టి నమూనాలను సేకరించాలన్నారు. వరిలాంటి పంటలకు 15 సెంటీమీటర్ల లోతు వరకు, మిరప లాంటి వాణిజ్యపంటలకు అయితే 30 సెంటీమీటర్ల లోతు వరకు మట్టి సేకరించాలన్నారు. వ్యవసాయ విస్తరణ సిబ్బంది అంజిత్ కుమార్ రెడ్డి, నాగమణి, వీఆర్వో తిరుపాలయ్య రైతులు నల్లప్ప, సుబ్బయ్య పాల్గొన్నారు.

సూర్య ఘర్ పథకం ఎస్సీ, ఎస్టీలకు ఉచితం

విశాలాంధ-బనగానపల్లె: సూర్య ఘర్ పథకం ఎస్సీ, ఎస్టీలకు ఉచితమని ఆర్డిఓ నరసింహులు అన్నారు. బనగానపల్లె గ్రామపంచాయతీలో సూర్య ఘర్ పథకంపై గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ గ్రామ సభకు ముఖ్య అతిథులుగా ఆర్డీవో నరసింహులు తాహసిల్దార్ నారాయణరెడ్డి ఎంపీడీవో వెంకటరమణ విద్యుత్ ఏడి మద్దిలేటి ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది గ్రామ కార్యదర్శులకు సూర్య ఘర్ పథకం పథకంపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉచితంగా ఎస్సీలకు సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోవచ్చని వెనుకబడిన తరగతులకు థర్టీ పర్సెంట్ సబ్సిడీస్తుందని తెలిపారు. ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఈవో సతీష్ రెడ్డి, విద్యుత్ ఏఈ శ్రీనివాసులు, రూరల్ ఏఈ గజప్ప, గ్రామ పంచాయతీ కార్యదర్శులు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజల రక్షణ కోసమే పోలీసులు

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా: ప్రజల రక్షణ కోసమే పోలీసులు ఉన్నారని ఆ సంఘటనలు జరిగినా వెంటనే సహకరించి సమాచారం అందించాలని నందికొట్కూరు రూరల్ సి ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని మల్లెం గ్రామంలో నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు జూపాడుబంగ్లా ఎస్సై లక్ష్మీనారాయణ తో కలిసి బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో నందికొట్కు రూరల్ సి ఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గ్రామంలో అందరూ ఐకమత్యంతో ఎలాంటి అల్లర్లు గొడవలకు వెళ్లకుండా సోదరభావంతో ప్రశాంతంగా జీవించాలని ఏదైనా అనుకోని సంఘటన జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం అందించిన పోలీసులు తక్షణమే రక్షణ కల్పిస్తారని తెలియజేశారు.రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని రోడ్డు భద్రతా నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యం చేరాలని తెలియజేశారు. సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన కల్పిస్తూ ఎట్టి పరిస్థితులలోనూ వ్యక్తిగత సమాచారం ఎవరితోనో పంచుకోరాదని తెలిపార.ు ఎవరైనా సైబర్ నేరగాల చేతిలో మోసపోతే వెంటనే 1930 నంబర్ కు ఫోన్ చేసి తక్షణ సహాయం పొందవచ్చునని తెలియజేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారిగా డాక్టర్ వీవీ రంగనాథ బాబు

విశాలాంధ్ర - సి.బెళగల్: మండల ప్రత్యేక అధికారిగా డాక్టర్ వీవీ రంగనాథ బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు మండల ప్రత్యేక అధికారిగా పని చేస్తున్న శ్యామల స్థానంలో ఆయన ఎంపీడీఓ రాణెమ్మ సమక్షంలో బాధ్యతలు తీసుకొని అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో మండల స్థాయి అధికారులపై ఎప్పటికప్పుడు విధుల పట్ల దృష్టి సారించి ప్రజలకు సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. విధుల్లో అలసత్వం చూపుతున్న అధికారులపై దృష్టి సారించి తగు చర్యలు చేపడతామని ఆయన అన్నారు. అనంతరం మండలంలోని సమస్యలపై ఆయన అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాణెమ్మతో పాటు సూపరిండెంట్ శ్రీనివాసులు తదితర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

యువత వ్యక్తిత్వ వికాస శిక్షణ

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: యువత విజయానికి అద్భుత మార్గ దర్శకంగా నిలిచే వ్యక్తిత్వ వికాసంపై ఉచిత శిక్షణ తరగతులు బుధ వారం లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా లయన్ డా.రాయపాటి శ్రీని వాస్ మాట్లాడుతూ నేటి యువతలో విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం కూడా అత్యంత అవసరమని పేర్కొన్నారు.ఇది వారి వ్యక్తిగత మరియు వృత్తిపరమైన జీవితాన్ని తీర్చిదిద్దే శక్తివంతమైన సాధనమన్నారు. మానవ సంబంధాల్లో రాణించేందుకు, సమాజంతో సమన్వయం చేసుకునేందుకు, నాయకత్వ లక్షణాలను వికసించేందుకు ఈ తరగతులు ఎంతో ఉపయోగపడతాయి అని తెలిపారు.ఈ తరగతుల్లో విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, బాడీ లాంగ్వేజ్, టైం మేనేజ్ మెంట్, ఇంటర్వ్యూ స్కిల్స్, గ్రూప్ డిస్కషన్, మోటివేషన్, గోల్ సెట్టింగ్, నాయకత్వ లక్షణాలు తదితర అంశాలపై సమగ్ర శిక్షణ అందించబడుతుందన్నారు. ఆసక్తి కలిగినవారు ముందస్తు నమోదు చేయగలరని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ కార్యదర్శి లయన్ గోపీనాథ్, సభ్యులు, నైస్ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర- గూడూరు: మండలంలోని గుడిపాడు గ్రామంలో అప్పాల రెడ్డి తాత తిరుణాల సందర్భంగా గ్రామస్తులు ఆధ్వర్యంలో నిర్వహించిన వృషబాల బండలాగుడు పోటీలకు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి హాజరై ప్రారంభించారు. గ్రామ టీడీపీ నేతలు, కార్యకర్తలు, గ్రామస్తులు ఎమ్మెల్యేకు పూలమాలతో స్వాగతం పలికారు. పోటీల్లో గెలుపొందిన వృషభాల యజమానులకు మొదటి బహుమతి కోడుమూరు నియోజకవర్గ సీనియర్ టిడిపి నాయకులు డి.విష్ణువర్ధన్ రెడ్డి రూ.40 వేలు, రెండో బహుమతి ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి రూ.30 వేలు, మూడో బహుమతి ఆదికేశవరెడ్డి రూ.20 వేలు, నాలుగో బహుమతి తెలుగు సంఘం నాయకులు రూ.10 వేలు, ఐదవ బహుమతి కరెంటు పెద్దయ్య రూ.5వేలు అందజేస్తున్నట్లు క్రీడల నిర్వహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లెల్సీ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, టీడీపీ నేతలు చంద్రారెడ్డి, రాఘవరెడ్డి, ఎర్రమల తదితరులు పాల్గొన్నారు.

పేదల దేవుడు ఫాదర్ విన్సెంట్ పెర్రర్

విశాలాంధ్ర- డోన్: పేదల పాలిట దేవుడు ఫాదర్ విన్సెంట్ పెర్రర్ సీపీఐ మండల కార్యదర్శి బి.నారాయణ, ఏ ఐవైఎఫ్ డోన్ మండల కార్యదర్శి జి పృథ్వీ కుమార్ అన్నారు. ఫాదర్ విన్సెంట్ పెర్రర్ జయంతిని డోన్ మండల పరిధిలోని సీసం గుంతల గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫాదర్ విన్సెంట్ పెర్రర్ దాదాపుగా 3 వేల మిలియన్ల మొక్కలు, 1700 పాఠశాలలు, 30 వేల బావులని తవ్వి పేద మధ్య తరగతి ప్రజలకు దేవుడుగా నిలిచారన్నారు.గ్రామాల అభివృద్ధి కి ఆయన చేసిని కృషి మరువలేనిదన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డిటి సీసం గుంతల చైర్మన్ పెద్ద రాముడు, కార్యదర్శి లక్ష్మన్న, సంఘం నాయకులు మనోహర్, జి.గోపాల్, కె.శివశంకర్, ఎం.రాజు, ఆర్.శ్రీనివాసులు, జి.బాలు, చరణ్, మధు, సాగర్, తేజ పాల్గొన్నారు.